ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 9 ఆగస్టు 2025





వరలక్ష్మీ వ్రతాలు.. పూజలు

శ్రావణ మాసం మూడో శుక్రవారం రోజు మహిళలు వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. వ్రతాలు.. పూజలతో వాడవాడ లా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాలు, ఇళ్లల్లో కూడా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వహించిన శ్రావణమాస పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

● దాచేపల్లిలో శ్రీ వాసవి మాతకి నగదుతో అలంకరణ ...
● వీర్లంకమ్మ తల్లి ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

రోడ్డు విస్తరణకు.. రూ.16 కోట్లు

రెంటచింతలలో ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్

రెంటచింతల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల ప్రజల ట్రాఫిక్ కష్టాలకు తెరపడనున్నది. ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల ఇబ్బందులు పరిష్కరిస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సాకారం చేయనున్నారు. రెంటచింతల రోడ్డు విస్తరణకు రూ.16 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఈ నెల 12న టెండర్లు నిర్వహించి వచ్చే నెల 10 నుంచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మాచర్ల నుంచి గురజాల వరకు 13.17 కిలోమీటర్ల బైపాస్‌కి రూ.54 కోట్లు మం జూరు కాగా రెంటచింతల గోలి వాగు ఇవతలి నుంచి హెచ్‌పీ గ్యాస్ చివర జాతీయ రహదారిలో కలిసే వరకు బైపాస్ రోడ్డుకు సమాంతరంగా రెంటచింతల ప్రధాన రోడ్డును 4.1కి.మీ విస్తరణ చేపడతామన్నారు. ప్రస్తుతం రెంటచింతలలో 7 మీ టర్ల తారు రోడ్డు ఉందని దానికి ఇరువైపులా 5 మీటర్ల వరకు విస్తరణతో పాటు డ్రెయినేజ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పుడున్న రోడ్డును 8 అంగుళాల ఎత్తుకు పెంచుతామని ఎస్‌బీఐ సమీపంలో అడుగున్నర ఎత్తు చొప్పున అర కిలోమీటర్ దాకా నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విస్తరించనున్న రెంటచింతల ప్రధాన రహదారి

కాన్పులకు వస్తే.. కట్టేయించుకోవాలి

● ప్రమాదకరంగా తల్లీపిల్లల ఆస్పత్రి భవనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. తల్లీపిల్లల విభాగంలో భవనం శ్లాబ్ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాల సమయంలో ఆపరేషన్ థియేటర్ భవనం పైకప్పు నుంచి నీరు కారుతున్నది. ఆపరేషన్ థియేటర్ లోపల, బయట శ్లాబ్ నుంచి తరచూ పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో అటు కాన్పులకు వచ్చే తల్లులు, వారి బంధువులతో పాటు సిబ్బంది కూడా ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా మారిన శ్లాబ్‌కు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


● ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ వద్ద పెచ్చులూడిన శ్లాబ్ (వృత్తంలో శ్లాబ్ నుంచి కారుతున్న నీటి కోసం ఏర్పాటు చేసిన గిన్నె)


● రోగులు ఉండే గదిలో పెచ్చులూడిన పైకప్పు

అంతన్నారు.. ఇంతేనా?

చివరి ఆకు వరకు కొంటాం.. ఎవరూ ఆందోళన చెందొద్దు.. అధైర్య పడొద్దు.. అని పాలకుల హామీతో పొగాకు రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామన్న ప్రభుత్వ తాజా ప్రకటనతో అయోమయం.. ఇంతలోనే 30 క్వింటాళ్లు తీసుకు రమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మార్క్‌ఫెడ్ నుంచి మెసేజ్‌లతో రైతుల్లో గందరగోళం. మొత్తం మీద పొగాకు కొనుగోళ్లకు సంబంధించి అసలు ఎంత పరిమాణంలో కేంద్రా లకు తీసుకు వెళ్లాలో అర్థం కాక రైతులు కలవరం చెందుతున్నారు. ఫోన్లకు వచ్చిన మెసేజ్ ప్రకారం కేంద్రాలకు పొగాకు తీసుకెళ్తే అక్కడ కొనుగోలు చేయకపోవడంతో మళ్లీ ఇళ్లకు తీసుకువచ్చేందుకు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అదనుగా తీసుకున్న కంపెనీలు తాము చెప్పిందే రేటుగా చెలరేగి పోతున్నాయి. ఈ గందరగోళంతో ప్రభుత్వంపై తొలుత వచ్చిన సానుకూలత.. జరుగుతున్న పరిణామాలతో కొంతవ్యతిరేకతగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.


బాపట్ల కొనుగోలు కేంద్రం వద్ద పొగాకు బేళ్లతో బారులు తీరిన ట్రాక్టర్లు (పాత చిత్రం)

● పరిమితి ప్రకటనతో రైతుల్లో అసహనం
● రైతులకు వస్తోన్న మెసేజ్‌లపైనా అస్పష్టతే
● 20 క్వింటాళ్ల నిర్ణయం కంపెనీలకు వరమయ్యేనా?

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చివరి ఆకువరకు కొంటానని చెప్పి ప్రభుత్వం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభించింది. నాలుగు జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఇప్పటికే 11,100 మెట్రిక్ టన్నుల బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. అయితే అంతా సవ్యంగా సాగిపోతోంది అనుకునేంతలో ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పొగాకు రైతులను కలవరపెడుతోంది. మిగిలిన పొగాకును కంపెనీల చేత కొనే ఏర్పాటు చేయిస్తామనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అయితే అధికారులు మాత్రం 30 క్వింటాళ్లు తీసుకురమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో 30 క్వింటాళ్లతో కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటున్న రైతులు మిగిలిన పది క్వింటాళ్లను తిరిగి తీసుకెళ్లాల్సి వస్తోంది. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తాజాగా పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు ప్రకటించారు. కానీ ఈ విషయంలో రైతుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది.

మీ పొగాకు పంట మద్దతు ధర (HDR 120 Rs /కే జి , HDM 90 Rs /కే జి , HDX 60Rs /కే జి) తో కొనుగోలు కేంద్రం వారు BAPATLA (జిల్లా) , KARAMCHEDU (మ) ,JARUBULAVARIPALEM , ADIPUDI PACS కొనుగోలు కేంద్రం వారు రైతు సేవా కేంద్రం వద్ద 05-AUG-2025నాడు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయదురు. మీ నమోదు సంఖ్య: CM21846066. మీ కొనుగోలు పరిమితి : 30 క్వింటాల్ వరకు. ధన్యవాదాలు. -GOVTAP

30 క్వింటాళ్ల వరకు కొనుగోలు పరిమితి అని ఓ రైతు సెల్‌కు వచ్చిన మెసేజ్

సమన్వయం.. సన్నద్ధత లోపాలు

ఆయా విభాగాల మధ్య సమన్వయ లోపంతో పాటు కొనుగోళ్లపై ముందస్తు సన్నద్ధతలో లోటుపాట్లు బర్లీ రైతులను కలవరపెడు తున్నాయి. రైతుల వద్ద (మిగతా 6వ పేజీలో)

వ్యూహాత్మకంగా కంపెనీలు..

పొగాకు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే సమాంతరంగా అంతోఇంతో కంపెనీలు కూడా దాదాపు అదే ధరకు బర్లీని కొంటూనే వస్తున్నాయి. కానీ ప్రభుత్వం తీసుకున్న పరిమితి నిర్ణయంతో మార్కెట్ నుంచి తాత్కాలికంగా వారు వైదొలిగారనేది సమాచారం. మార్క్‌ఫెడ్ కొనగా మిగిలింది కంపెనీల చేత కొనుగోలు చేయిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యే కదా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. మళ్లీ అవే మాటలు ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు విశ్వసించడంలేదు. పరిమితి నిర్ణయం కంపెనీలకు వరంలా మారే అవకాశం ఉందనేది ట్రేడ్‌వర్గాల అంచనా.

రైళ్లు కిటకిట

● వరుస సెలవులతో వెయిటింగ్ లిస్టులు
● ఈ వారం, వచ్చే వారంలో మూడు రోజులు సెలవులు

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండు వారాలు.. అది కూడా వారాంతంలో మూడేసి రోజులు చొప్పున సెలవుదినాలు రావడంతో గుంటూరు రైల్వే జంక్షన్ మీదగా రాకపోకలు సాగించే రైళ్లన్ని కిక్కిరిసిపోతోన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఈసారి వరలక్ష్మీ వ్రతానికి కూడా సెలవు ఇచ్చింది. దీంతో ఈ వారంలో మూడు సెలవుదినాలు వరుసగా వచ్చాయి. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, రెండో శనివారం, ఆదివారం వరుసగా సెలవులు వచ్చాయి. అలానే వచ్చే వారం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 17న ఆదివారం సెలవులు ఉన్నాయి. దీంతో సొంత ఊళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లి సరదాగా గడిపి వచ్చేందుకు చాలామంది ఇప్పటికే ప్రయాణం కాగా కొంతమంది వచ్చే వారం ప్రణాళిక రూపొందించుకున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు, అటు నుంచి గుంటూరుకు రద్దీ అధికంగా ఉంటున్నది. అలానే బెంగళూరు, చెన్నైలకు కూడా రద్దీ ఎక్కువగానే ఉంటోన్నది. డిమాండ్ అధికంగా ఉండటంతో రెగ్యులర్ రైళ్లలో కూడా చాలావరకు నోరూం డిస్‌ప్లే వచ్చేసింది. కొన్ని రైళ్లలో వెయిటింగ్ లిస్టులో టిక్కెట్లు బుకింగ్ అవుతున్నా అవి 150కి పైగా ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే అదనపు బోగీని జత చేసినా టిక్కెట్లు కన్‌ఫర్మ్ కావు.



టికెట్లు లేవని చూపిస్తున్న రైల్వే యాప్

పెళ్లి ప్రయాణాలు మొదలు..

ప్రస్తుతం నిశ్చయ తాంబూలాలు, లగ్నపత్రిక రాసుకోవడం, వివాహ శుభకార్యాలు, రిసెప్షన్లు కూడా పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. దీంతో హైదరాబాద్‌కు రాకపోకలు బాగా పెరిగాయి. కాగా ఎల్‌హెచ్‌బీ బోగీలుగా చాలా రైళ్లు మారిపోయాయి. దాంతో వాటిల్లో స్లీపర్‌క్లాస్ కోచ్‌ల సంఖ్య తగ్గి సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు పెరిగాయి. ఈ కారణంగా స్లీపర్ క్లాస్ బోగీలలో బెర్తులు తగ్గడంతో కనీసం వెయిటింగ్ లిస్టులో కూడా టిక్కెట్లు లభించడం లేదు. కొన్ని ప్రత్యేక రైళ్లు గుంటూరు మీదగా నరసపూర్, కాకినాడ టౌన్‌లకు నడుపుతున్నా వాటిల్లోనూ హాట్‌కేక్‌లు మాదిరిగా టిక్కెట్లు బుకింగ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాయంత్రం వేళ మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమాలకు అండ

● పునః పరిశీలన పేరుతో కాలయాపన ● రూ.1.35 కోట్ల ఉపాధి అవినీతిపై నిర్లక్ష్యం

శావల్యాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతిని వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సామాజిక తనిఖీలు చేపట్టగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అక్రమాలను కప్పిపెట్టేలా వ్యవహరిస్తోన్న తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి అవినీతిని వెలికితీసినా పునఃపరిశీలన పేరుతో కాలయాపన చేస్తున్నారు. అవినీతి సొమ్మును రికవరీ చేయాల్సిన అధికారులు సామాజిక తనిఖీలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోనప్పుడు లక్షలు ఖర్చు చేసి సామాజిక తనిఖీలు ఎందుకని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో రూ.7.94 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీలు జరిగాయి. ఇందులో రూ.1.96 కోట్లు పనుల్లో వ్యత్యాసాలున్నట్లు డీఆర్పీలు గుర్తించారు. ఈ ప్రకారం రూ.1.35 కోట్ల పనులను పునఃపరిశీలన చేయాలని, రూ.13.86 లక్షల పనులకు తగిన ఆధారాలు చూపించాలని ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి రూ.3,21,326 రికవరీలు, రూ.38 వేలు పెనాల్టీ విధించారు. అయితే సామాజిక తనిఖీలను నీరుగార్చేలా ఉపాధి అధికారుల నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అవినీతిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.



శావల్యాపురంలో సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు (పాత చిత్రం)



కలవరపెడుతున్న సుంకం

● సందిగ్ధంలో ఆక్వా రైతులు
● అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం
● ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన
● చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు

కాల గర్భంలోకి.. శంకర్ విలాస్ ఆర్‌వోబీ



● నేటి నుంచి కూల్చివేత ప్రారంభం
● ఆరు దశాబ్దాలకు పైగా నగర వాసులకు సేవలు

నచ్చిన లైటింగ్‌కు లైక్ కొట్టండి!

● సీఆర్‌డీఏ ప్రాజెక్టు భవనం లైటింగ్ డిజైన్‌పై ఓటింగ్
● వెబ్‌సైట్‌లో రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలు

8

పోలీసు క్వార్టర్స్.. శిథిలం

● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా భవనం
● నిరుపయోగమైనా సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ కోత


ఎస్‌హెచ్‌వో క్వార్టర్స్

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన అమరావతిలో 2006లో నిర్మించిన పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. అపార్ట్‌మెంట్ మోడల్‌లో ఎనిమిది మంది సిబ్బంది, ఎస్‌హెచ్‌ఓకు ప్రత్యేకంగా ఓ క్వార్టర్ నిర్మించగా ఐదేళ్లుగా నివాసయోగ్యంగా లేవు. దీంతో అందులో చేరేందుకు సిబ్బంది ఆసక్తి చూపలేదు. తాగునీటి సరఫరా నిలిచి, విద్యుత్ తీగలు అపహరణకు గురై, తలుపులు కిటికీలు, టైల్స్ పగిలిపోయి, క్వార్టర్స్ ప్రాంగణం పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తోంది. ప్రస్తుతం ఆ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రెండేళ్ల క్రితం క్వార్టర్స్‌ను తొలగించి అందులో కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, సిబ్బంది క్వార్టర్స్ నిర్మించాలని అధికారులు నిర్ణయించి ప్రతిపాదనలు పంపగా అవి మూలన పడినట్లు తెలుస్తోంది. అయితే క్వార్టర్స్‌లో నివాసయోగ్యంగా లేకపోయినా సుమారు పది మంది క్వార్టర్స్‌లో ఉన్నట్లుగా హౌస్ రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) కట్ చేస్తున్నారు. తాము క్వార్టర్‌లో నివాసం ఉండలేక ఇతర ప్రైవేటు భవనంలో అద్దెకు ఉం టున్నా తమ జీతంలో నుంచి హెచ్‌ఆర్‌ఏ కట్ చేయడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పై అధికారులకు చెప్పుకునేం దుకు ధైర్యం చాలక మిన్నకుండి పోతున్నారు.


క్వార్టర్స్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

సత్తెనపల్లికి బ్లడ్‌బ్యాంక్ మంజూరు

ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుకు ఆమోదం

సత్తెనపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు బ్లడ్ బ్యాంక్ మంజూరైనట్లు సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఇప్పటి వరకు సత్తెనపల్లిలో రక్త నిల్వ కేంద్రం మాత్రమే ఉంది. అత్యవసరంగా రోగులకు రక్తం అవసరమైతే నరసరావుపేట వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. అనేక మంది రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో ఎంతోకాలంగా బ్లడ్ బ్యాంక్ ఆవశ్యకతపై స్థానిక అధికారులు, ప్రజల నుంచి ప్రభుత్వానికి వినతులు వెళ్లాయి. ఈ క్రమంలో ఏరియా ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంకును ప్రభుత్వం మంజూరు చేసింది. బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సంబంధిత ఉన్నతాధికారులు ఆస్పత్రికి త్వరలో పంపుతున్నారని సూపరింటెండెంట్ తెలిపారు. పూర్తి స్థాయిలో పరికరాలు రాగానే బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ప్రారంభమైతే అవసరమైన రోగులకు ఏ సమయంలోనైనా రక్తం అందించే అవకాశం ఉంటుందన్నారు.



● సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అంతన్నారు..ఇంతేనా?

(5వ పేజీ తరువాయి)

పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని తెలిసినా అందుకు తగ్గట్లు గిడ్డంగుల లభ్యత ఉందో లేదో తెలుసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లలో కొనుగోలు చేసిన బర్లీ నిల్వలను మార్క్‌ఫెడ్ ఉంచింది. ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు గోడౌన్లను వెదకడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో అయితే తేదీ మారే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ఉండేందుకే స్లాట్ సిస్టమ్ అని చెప్పిన మార్క్‌ఫెడ్ ఇప్పుడు చేతులెత్తేయడం కూడా రైతుల విమర్శలకు కారణమైంది. రెండే గ్రేడ్లు అని ముందు చెప్పిన మార్క్‌ఫెడ్ మూడుగా విభజించి కొనుగోలు చేయడంతో పాటు ధరల విషయంలో కూడా అదే రీతిన వ్యవహరిస్తోందనేది రైతుల ఫిర్యాదు. ఇలా అనేక బాలారిష్టాలతో రైతులు కలవరం చెందుతున్నారు.

సత్వరం కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ (475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎల్.మాణిక్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీజే గాంధీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లు సుమారు 70శాతం మంది బోధిస్తున్నట్లు తెలిపారు. గతంలో అమలు చేసిన 12 నెలల రెన్యువల్ ఉత్తర్వులు తిరిగి పునరుద్ధరించి, 2024-25 మే నెల వేతనాలు విడుదల చేయాలని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ విద్యాశాఖలో ఎన్నికల నియమావళి కారణంగా నిలిపివేసినట్లు తెలిపారు.

చేపల వేట సాగిస్తూ.. మత్స్యకారుడి మృతి

బాపటరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చేపలవేట చేస్తూ ప్రమాదవశాత్తు బోటు నుంచి జారీపడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చీరాల మండలం వాడరేవుకు చెందిన మత్స్యకారుడు మోకా పెద సోమయ్య (47) పిన్నిబోయినవారిపాలెం గ్రామ సమీపంలోని నాగరాజు కాల్వలో బోటుపై చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బోటు నుంచి కాల్వలోకి జారీపడిపోయాడు. స్థానిక మత్స్యకారులు సోమయ్య కోసం చాలా సేపు గాలించారు. కొన్ని గంటల తర్వాత వలకు సోమయ్య మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నార్త్ ఈస్టు లారీ ఓనర్స్..

అసోసియేషన్ రద్దుకు నిర్ణయం

● డిపాజిట్లు సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని రద్దు చేయాలని ప్రస్తుత పాలకవర్గం తీర్మానించింది. యూనియన్ పరంగా ఉన్న డిపాజిట్లను అసోసియేషన్ సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ చేయాలని నిర్ణయించింది. శుక్రవారం బుడంపాడు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద అసోసియేషన్ నాయకులు, సభ్యులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశానికి దాదాపుగా 40 మంది సభ్యులు హాజరయ్యారు. ప్రధానంగా లారీ యజమానుల సమస్యలపై చర్చించారు. కిరాయిలు బాగా తగ్గిపోవడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని, చార్జీలు పెంచుతామంటే అటు అధికారులు, ఇటు వ్యాపారులు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ఉండి లాభం లేదని నిర్ణయానికి వచ్చి రద్దు చేస్తున్నామని పాలకవర్గ సభ్యులు తెలిపారు.

స్వార్థ రాజకీయాల కోసం

దళితులపై దాడులు: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు తన స్వార్థ రాజకీయాల కోసం దళితుల మీద దాడులు చేస్తూనే ఉన్నాడని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. దళితులను చిత్రహింసలకు గురిచేయడం, చంపడం, డోర్ డెలివరీ చేయడం వైసీపీ నేతలకు హక్కుగా మారిపోయిందని ఆయన విమర్శించారు. తిరుపతిలో పవన్ కుమార్‌ను అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి.. తనను ఎవరూ కొట్టలేదని అతనితోనే వీడియో చేయించడం, ఆ వీడియోని ఆధారంగా తన భర్త శుద్ధపూజ అని చెప్పటం వైసీపీ నేర నైజానికి నిదర్శనమన్నారు. చిత్రహింసలకు గురైన పవన్ కుటుంబ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం ఇలాంటి విషపు మొక్కలను వైసీపీ పెంచి పోషిస్తోందని ఆయన ఆరోపించారు.

వారి ప్రతిభ..విభిన్నం

● ప్రారంభమైన దివ్యాంగ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు



క్యాచ్ పడుతూ..



తలపడుతున్న ప్రకాశం, గుంటూరు జట్లు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైకల్యం దాటిన వాటి ఆట.. క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో మూడు రోజుల దివ్యాంగులకు స్వర్ణాంధ్రా సెంట్రల్ జోన్ ఇంక్లూజివ్ క్రికెట్ కప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ప్రకాశం, గుంటూరు జిల్లా జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 5 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. చేజింగ్‌కు దిగిన ప్రకాశం నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేయగలిగింది. రెండు పరుగుల స్వల్ప తేడాతో గుంటూరు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లాల జట్లు తలపడగా.. 8 వికెట్ల తేడాతో కృష్ణా జట్టు గెలిచింది. ఈ పోటీలను కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు, సహాయకార్యదర్శి షేక్ నాగులమీరా, సురేష్ పర్యవేక్షించారు.

బూర్జువా పార్టీలను ఎదుర్కోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సీపీఐ జెండా ఆవిష్కరించిన ముప్పాళ్ళ నాగేశ్వరరావు

వినుకొండటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలు అధికారంలో ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సీపీఐ భుజ స్కందాలపై ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ద్వితీయ మహా సభలు సందర్భంగా.. 2వ రోజు శుక్రవారం స్థానిక గంగినేని కల్యాణ మండపంలో జిల్లా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ మహా సభల సందర్భంగా గత గురువారం నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతమైందని తెలిపారు. ఒకనాడు పల్నాడు జిల్లా కక్షలకు, పంతాలకు నిలయంగా ఉండేదని.. నేడు పరిస్థితులు మారి అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లాలో కీలకంగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు కేంద్రంలో అమిత్‌షా తదితర ఎన్‌డీఏ నేతలు జాతి ద్రోహులను దగ్గరకు తీసుకుంటున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ.. కేంద్రంలో రాక్షస పాలన సాగుతోందని, అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంపై వారికి ఎటువంటి గౌరవం లేదని అన్నారు. మైనార్టీ సీట్లతో గెలిచిన మోదీ తొలుత జగన్మోహన్‌రెడ్డిని, అనంతరం చంద్రబాబునాయుడుని ఆశ్రయించాడని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, పలు కార్యక్రమాలుపై కార్యదర్శి నివేదికను సభలో చదివారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వయ్యకంటి చెన్నకేశవరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ. మారుతివరప్రసాద్, సంద్రపాటి సైదా, షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, బూదాల శ్రీనివాసరావు, మహంకాళి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, ఎం. రమణారెడ్డి, టి.బాబురావు, సత్యనారాయణరాజు, శ్రీనివాసరావు, రమేష్, కోటా మాల్యాద్రి, శారమ్మ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

దొంగ దొరికాడు..



దొంగను అరెస్టు చూపిస్తున్న అర్బన్ పోలీసులు

పొన్నూరుటౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈ నెల 5న దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగను శుక్రవారం అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ ఎల్ వీరనాయక్ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ సమీపంలోని దుర్గా పెయింట్ షాప్‌లో చోరీపై యజమాని షేక్ సాదిక్ బాష ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు భాగంగా గుంటూరు పట్టణానికి చెందిన మిక్కిలి సందీప్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. దుకాణంలో చోరీ చేసిన రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో 18 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదయ్యాయని వెల్లడించారు. 9 సార్లు నిందితుడు జైలుకు వెళ్లి వచ్చి తిరిగి దొంగతనం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పది రోజుల క్రితం ఒంగోలు రూరల్ పరిధిలో రెండు కేసుల్లో రూ. 60 వేలు, స్కూటీ, పల్నాడు జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం చేసినట్లు చెప్పారు. మొత్తంగా రూ. 1,05,000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో స్కూటీని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. నేరం జరిగిన 36 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసిన స్టేషన్ సీఐ వీరనాయక్ ఎస్ఐ శ్రీహరిని డీఎస్పీ జనార్దన్ రావు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 29 వేల క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 68,900 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 40 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 29 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 18,055 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 7713 క్యూసెక్కులు..

దుగ్గిరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి శుక్రవారం గరిష్ఠంగా 7,713 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజి వద్ద 12.0 క్యూసెక్కులనీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 300, రేపల్లె కాల్వకు 1861, తూర్పుకాల్వకు 702, పశ్చిమ కాల్వకు 277, నిజాంపట్నం కాల్వకు 449, కొమ్మమూరు కాల్వకు 3180 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

జిల్లా జైలు నుంచి తురకా కిశోర్ విడుదల



జిల్లా జైలు నుంచి విడుదలైన రౌడీషీటర్ తురక కిశోర్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, రౌడీ షీటర్ తురక కిషోర్ శుక్రవారం జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కిషోర్ చేసిన నేరాలకు సంబంధించిన కేసుల్లో సుమారు 8 నెలలుగా ఆయన గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఇటీవల ఆయన ఆయా కేసుల్లో బెయిల్ పై విడుదల కాగా టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నంకు సంబంధించి నమోదైన మరో కేసులో పోలీసులు అరెస్టు చేశారు. దీనిని సవాల్ చేస్తూ తురకా కిషోర్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిందితుడు కిషోర్ ను వెంటనే విడుదల చేయాలంటూ ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం ఆయనను గుంటూరు జిల్లా జైలు అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా జైలు వద్దకు ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో వచ్చారు. అదేవిధంగా వైసీపీకి చెందిన న్యాయవాదులు జైలు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అండగా నిలిచిన జగన్, అదేవిధంగా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలతో పాటు వైసీపీ లీడర్ సెల్ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఎల్‌లో..

అమరావతి రాయల్స్ శుభారంభం

●కాకినాడ కింగ్స్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్ సీజన్-4 టోర్నీలో అమరావతి రాయల్స్ శుభారంభం చేసింది. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ మూడు వికెట్ల తేడాతో కాకినాడ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కాకినాడ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 229 పరుగులు చేసింది. కెప్టెన్ కేఎస్ భరత్ (93; 46 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లు), కేపీ రాహుల్ (96; 49 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లు) చెలరేగి రెండో వికెట్‌కు 183 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అమరావతి రాయల్స్ బౌలర్లలో బి.సంతోష్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టగా, యశ్వంత్, అయ్యప్ప చెరో వికెట్ తీశారు. అమరావతి రాయల్స్ బ్యాటింగ్‌కు దిగే సమయానికి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. వర్షం తగ్గడంతో డీఎల్ఎస్ మెథడ్ ప్రకారం అమరావతి రాయల్స్‌కు 14 ఓవర్లలో 173 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. అమరావతి రాయల్స్ 13.2 ఓవర్లలో ఏడు వికెట్లకు 173 పరుగులు చేసి అనూహ్య విజయం సాధించింది. కెప్టెన్ హనుమ విహారి (39), కరణ్ షిండే (28), పాండురంగరాజు (26), ఎవీవీ విజయ్ (30), అయ్యప్ప (12 నాటౌట్) రాణించి జట్టుకు అనూహ్య విజయాన్నందించారు. కాకినాడ కింగ్స్ బౌలర్ తపస్వి నాలుగు వికెట్లు పడగొట్టినా ఫలితం లేకపోయింది.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం..

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఊరు పేరు తెలియని మృతదేహాలు రెండు నగరంలోని వేర్వేరు ప్రదేశాల్లో శుక్రవారం లభించాయి. 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి మృతదేహం.. కొత్తపేట, ఉమెన్స్ కాలేజీ రోడ్డులో బస్సు షెల్టర్ పక్కన కొత్త పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మార్చురీ ఎదురుగా పడి ఉండడంతో.. ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందాడు. మృత దేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారంలో కొత్త పేట పోలీసులు భద్రపరిచారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దాచేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గురజాల మండలం అంబాపురం గ్రామా నికి చెందిన దోమతోటి బాజీ(27) పిడుగురాళ్ళలోని నున్న మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహ నంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో దాచేపల్లిలోని సహజ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అతనిని ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలి ంచారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయం..

పాలక మండలి నియామకానికి ఆహ్వానం

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ జి.లీలా కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను దేవస్థానంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హైదరాబాద్ ఐఐటీతో విజ్ఞాన్స్..

అవగాహన ఒప్పందం



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వడ్ల మూడి విజ్ఞాన్స్ యూ నివర్సిటీ - హైదరా బాద్ ఐఐటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శుక్రవారం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఐఐటీ - హైదరాబాద్ స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి.నరహరి శాస్త్రితో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఉమ్మడిగా పరిశోధనలు, డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవ చ్చునన్నారు. ప్రొఫెసర్ నరహరి శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యమన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

● తుమ్మలపాలెం వద్ద కేజిన్నర గంజాయి స్వాధీనం

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పరాయి రాష్ట్రం నుంచి ఇక్కడకు వచ్చి గుట్టుగా గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టును.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు రట్టు చేశారు. ముందస్తు పక్కా సమాచారంతో జాతీయ రహదారిపై ఉన్న తుమ్మలపాలెం గ్రామం వద్ద నిర్వహించిన దాడుల్లో కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిని అడ్డాగా చేసుకుని.. వెంబడి ఉన్న విద్యాలయాలు, కంపెనీలను టార్గెట్ చేసకుని ఎంతో కాలంగా విక్రయాలు సాగిస్తున్నారు. టాస్క్ ఫోర్సు సీఐ బి.నయనతార ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సిబ్బంది తుమ్మలపాలెం గ్రామంలోని ఓల్డ్ బేరింగ్ కంపెనీ వద్ద దాడులు నిర్వహించారు. ఒడిశాకు చెందిన దీపక్ శెట్టి, పబాన్ బెహెర అనే ఇద్దరు పార్వతీపురానికి చెందిన లక్ష్మీ లతా మాలిక్‌తో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వీరి నుంచి 1,557 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసకుని.. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ నయనతార తెలిపారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది నాంచారయ్య, నాగరాజు, చైతన్య, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల పేరు చెప్పి...

రూ.50 వేలు ఫోన్ పే చేయించుకున్నారు!

● తల్లిదండ్రులకు సైబ్ నేరగాళ్ల టోకరా

ముప్పాళ్ళ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలేనికి చెందిన కిరాణా షాపు నిర్వాహకులు రూ.50 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మప్పాళ్ళ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనుమల శెట్టి శ్రీనివాసరావు పద్మావతి దంపతులు కిరాణాషాపు నడుపుతుంటారు. ఈ నెల 6న మధ్యాహ్నం 98012 41475 అనే నంబర్ నుంచి శ్రీనివాసరావు ఫోనుకు కాల్ వచ్చింది. పద్మావతి ఫోన్ లిఫ్ట్ చేయగా ఫోన్ చేసిన వారు మాట్లాడుతూ 'మీ కుమారుడు బాలవెంకట సతీష్ ఒక అమ్మాయిని వేధిస్తూ.. పోలీసు కేసులో ఇరుక్కున్నాడు. మీ కుమారుడు అరెస్టు కాకుండా ఉండాలంటే మేము ఫోన్ చేసిన నంబర్‌కు రూ.50 వేల ఫోన్ పే చేయండి.' అని హెచ్చరించారు. దీంతో కంగారు పడిన పద్మావతి విషయాన్ని భర్తకు వివరించింది. బిడ్డ క్షేమం కోరిన వారు వెంటనే ఆ నగదును సదరు నంబర్‌కు ఫోన్ పే చేశారు. తర్వాత తమ కుమారుడు క్షేమంగానే ఉన్నాడని తెలుసుకుని విస్తుపోయారు. మోసపోయామని తెలుసుకుని ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ సైబర్ నేరగాళ్ళ పనేనని తెలిపారు. ఇటివంటి గుర్తింపులేని కాల్స్ వచ్చినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎవరూ.. డబ్బుల అడగరనీ ఇటువంటి కాల్స్‌పై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు.

మహిళ మెడలో బంగారు ఆభరణాలు చోరీ

వినుకొండ టౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): గుడి నుంచి ఇంటికి నడిచి వెళుతున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వీవీఆర్ గోల్డ్ షాపు యజమాని భార్య కొండమెట్ల సమీపంలోని సాయిబాబా దేవాయానికి వెళ్లి తిరిగొస్తోంది. బోసుబొమ్మ సెంటర్ వద్దకు రాగానే అక్కడ ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు ఆభరణాలు లాక్కొని పరారయ్యారు. మహిళ వెంటనే కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొన్నారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

చిలకలూరిపేట, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుండయ్య తోటలో రెండు రోజుల క్రితం విధి నిర్వహణలో ఉన్న పసుమర్రు సర్వేయర్ విద్యాసాగర్, పసుమర్రు వీఆర్వో కె.చంద్రశేఖర్, వీఆర్ఏ ఆశీర్వాదంపై జరిగిన దాడి కేసులో.. ముగ్గురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ పి.రమేష్ శుక్రవారం తెలిపారు. చల్లా శ్రీనివాసరావు, ఇద్దరు కుమారులను చిలకలూరిపేట కోర్టులో వారిని హాజరు పరిచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 589.10 అడుగులు ఉంది. ఇది 309.35 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598, ఎడమ కాలువ ద్వారా 7373, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 43,999 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 43,999 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.52 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 41,880 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కుల నీరు, రెండు గేట్ల ద్వారా 34,578 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 51,578 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

13న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్ వీ విజయ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, బ్యాంక్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సత్తెనపల్లి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్సు పథకం ప్రారంభం అయ్యేలోపు ఆర్టీసీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లయిస్ యూనియన్ కార్మికులు కోరారు. ఫ్రీబస్సు పథకం విజయవంతం కావాలంటే ఇప్పుడున్న బస్సులు, ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ప్రతి బస్సులో టిమ్స్ ఛార్జ్ చేస్తున్నందుకు ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులో ఉంచాలని, టిమ్స్ పనిచేయని పక్షంలో మాన్యువల్‌గా జీరో టికెట్ జారీచేసే విధానంపై స్పష్టమైన విధానంపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఫ్రీబస్సుకు అనుమతించిన ధ్రువీకరణ కార్డులు ఒరిజనల్స్‌తోపాటు జిరాక్స్ లేదా డిజిటల్ కార్డులను అనుమతించాలన్నారు.

పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

రాజుపాలెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. గ్రామానికి చెందిన ఓ రైతు కాలువ వస్తుంది పొలానికి నీరు పెట్టుకుందామని వెళ్లాడు. ఆ సమయంలో పక్క నుండి దుర్వాసన వస్తుండటంతో చూడగా మహిళ(45) మృతదేహం కనిపించింది. మహిళకు ఒక చేయి పూర్తిగా ఉండటం, రెండవ చేయి సగం వరకే ఉండటంతో హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ అక్కడికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సదరు మహిళ ఎవరికైనా తెలిస్తే ఎస్సై ఫోన్ నెం.9440796168, సీఐ ఫోన్ నెం. 9440796222 కు తెలపాలని కోరారు.

కారు బీభత్సం- ఇద్దరికి గాయాలు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద శుక్రవారం కారు బీభత్సం సృష్టించింది. వెనుకనుండి రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి నుండి గుంటూరు వైపు వెళుతున్న కారు నందిగామ అడ్డరోడ్డు వద్దకు రాగానే ముందుగా వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలను అతివేగంగా ఢీ కొంది. ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా ధ్వంసం కాగా ఒక వాహనంపై ఉన్న బెల్లంకొండకు చెందిన దంపతులు కళ్ళం శ్రీనివాసరావు, చాయమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత

అచ్చంపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కే శ్రీనివాసరావు చేతులమీదుగా బీటెక్ విద్యార్థిని మునగా ఝాన్సీలక్ష్మికి ల్యాప్‌ట్యాప్ అందించారు. మన్నెం భద్రయ్య, ఫౌండేషన్ కో -ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

డీలర్ల వద్ద యూరియా తప్పనిసరిగా ఉండాలి

బెల్లంకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి డీలర్ వద్ద యూరియా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఏవో అరుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రతి ఒక్క డీలర్‌కు ఎరువులు అందుతున్నాయని, రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించాలని సూచించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

● రూ 6,100 నగదు స్వాధీనం

పెదకూరపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6100 నగదును సీజ్ చేసినట్టు ఎస్ఐ గిరిబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని 75 తాళ్ళూరులో వారిని అరెస్టు చేసినట్టు ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పిడుగురాళ్ల విద్యుత్ శాఖ ఏఈ సైదారావు తెలిపారు. పిడుగురాళ్ల, కొండమోడు, జానపాడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

● రాజుపాలెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోట పెద మస్తాన్ తెలిపారు. మండలంలో ఉన్న అన్ని సబ్‌స్టేషన్‌లలోని 33కెవి, 11కెవి లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

● పెదకూరపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ మండలంలోని 75 తాళ్ళూరు విద్యుత్ సబ్‌స్టేషన్, పెదకూరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఆ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు మెయిటినెన్స్, మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● మాచర్లటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పట్టణ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● దుర్గి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీశైలం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రావణ లక్ష్మికి విశేష పూజలు



మాచవరం: వేమవరంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



పిడుగురాళ్ల: ప్రత్యేక అలంకరణలో వాసవిమాత



సత్తెనపల్లి: అలంకరణలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి

మాచవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. మోర్జంపాడు శివారు బుగ్గ మల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వేమవరం, పిన్నెల్లి, చెన్నాయపాలెం, పిల్లుట్ల, మల్లవోలు, కొత్తపాలెం, కొత్తగణేషునిపాడు తదితర గ్రామాల్లో మహిళలు దేవాలయాలకు వెళ్ళి పూజలు చేశారు.

● దాచేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వరలక్ష్మి వ్రతానికి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం దాచేపల్లిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి రూ.9లక్షల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. దాచేపల్లి గ్రామ దేవత శ్రీ వీర్లంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి లక్ష మల్లెపూలతో కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ లలిత, ఖడ్గమాల, కనకధార స్తోత్రాలను పటించారు. అంకమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి చండీహోమం చేశారు. గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని స్థానిక కనకదుర్గ అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. పట్టణానికి చెందిన భక్తులు రూ.5లక్షల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల పండ్లు, పూలతో అలంకరించారు. ఆయా దేవాలయాల్లో భక్తులు శ్రావణమాస, కుంకుమపూజల్లో పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి వ్రతాన్ని పలు గృహాల్లో ఆచరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలలో అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే అమ్మవారి చిత్రపటాలకు పూజలు నిర్వహించి ప్రసాదాలు సమర్పించారు. భక్తులు పలు ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ముత్తాయపాలెంలోని నిదానంపాటి ప్రసన్నలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజా నిర్వహించారు.

● అచ్చంపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరిగింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారావు, మణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

● బెల్లంకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు భారీగా తరలి వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంకొండ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గంగమ్మ, పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● క్రోసూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని వివిధ దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వర మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్దసంఖ్యలో కుంకుమ, లలిత సహస్రనామార్చనలు నిర్వహించారు. క్రోసూరులోని కొండమీద లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నరసింహస్వామి ఆల యం శ్రావణ శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతవరంలోని కళ్యాణ వేంకటేశ్వస్వా మి దేవాలయంలో శ్రావణ శుక్రవారం వేడుకలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.

● పెదకూరపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెదకూరపాడులోని అంకమ్మ తల్లికి శోభాయాత్రలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సామూహికంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు, పండ్లు, పలహారాలు తీసుకువెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకూరపాడులోని బొమ్మలగుడి రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.



అమరావతి: ముత్తాయపాలెంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు



అచ్చంపేట: కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం పూజలు చేస్తున్న మహిళలు



క్రోసూరు వాసవి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మహాలక్ష్మి అలంకారం

అంకాళమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ

కారంపూడి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అంకాళమ్మ అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయానికి పొంగళ్లతో ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం పోలేరమ్మ, పాతపాటేశ్వరమ్మ ఆలయాల్లో పొంగలి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి విగ్రహానికి సింహ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. మండలంలోని చింతపల్లిలో ఉన్న గ్రామ దేవత శ్రీపాతపాటేశ్వరి అమ్మవారికి ఉన్నం శ్రీనివాసరావు, అనురాధ దంపతులు 10 గ్రాముల బంగారు ముత్యాలహారంను శుక్రవారం సమర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి సీతారామాంజినేయులు, ఉన్నం మధు, శివయ్య, రామారావు, గమిడి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



కారంపూడి: అమ్మవారికి ముత్యాలహారం సమర్పిస్తున్న ఉన్నం శ్రీనివాసరావు, అనురాధ దంపతులు



రెంటచింతల: అలంకరణలో శ్రీ వాసవి అమ్మవారు

● దుర్గి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి, వాసవీ మాత, సరస్వతిదేవి, గంగా భ్రమరాంబికాదేవి, లక్ష్మీదేవి ఆలయాల్లో శ్రావణ వరలక్ష్మి వ్రతం జరిపారు. స్థానిక శ్రీగంగాభ్రమరాంబిక సమేత నగరేశ్వర నాగేశ్వర ఓంకారేశ్వరస్వామి ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు.

● రెంటచింతల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవాసవి అమ్మవారిని శ్రావణి వరలక్ష్మీగా అలంకరించారు. వరలక్ష్మీ వ్రత పూజలు, సామూహిక కుంకుమార్చనలు పలు చోట్ల చేశారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ



వైద్యులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

మాచర్లరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తనిఖీ చేశారు. వైద్యశాలలోని వసతులను పరిశీలించారు. రోగులకు అందుస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఓపీ రికార్డులను తనిఖీచేశారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కంభంపాడులో పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మావతి, సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, నాగమనాయక్, వాగ్యానాయక్, మరియరాణి, కరిముల్లా పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

● పట్టణ ఎస్ఐ వెంకట్రావు

మాచర్లటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ వెంకట్రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రింగురోడ్డు సెంటర్లో తన సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రావు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలి

● ఏవో అమీర్‌రెడ్డి

దుర్గి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈ - పంట నమోదు చేసుకోవాలని ఏవో అమీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పంట నమోదును చేయించుకోవాలన్నారు. పంటల బీమా పథకాన్ని ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించారన్నారు. అన్నదాత సుఖీభవ నగదు పడని వారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలన్నారు.

వాహనానికి ప్రభుత్వ స్టిక్కర్‌తో హల్‌చల్

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కారంపూడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కారంపూడి పట్టణంలో ఇన్నోవా వాహనానికి ప్రభుత్వ స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఆరుగురుని వాహనంలో ఎక్కించుకొని హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్‌రాజా గరికపాటి అనే వ్యక్తి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్‌గా ఉన్నారన్నారు. రమేష్‌రాజాకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఇన్నోవా వాహనానికి ప్రభుత్వ స్టిక్కర్ ఏర్పాటు చేసుకొని కారంపూడి పట్టణ శివారులో ఓ స్థలం పంచాయితీలో కొందరు వ్యక్తులను బెదిరిస్తున్నారన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చి బెదిరింపులకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.



ప్రభుత్వ స్టిక్కర్‌తో ఉన్న ఇన్నోవా వాహనం

కులాల మధ్య చిచ్చు పెడుతున్న వైసీపీ నేతలు

దాచేపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చు లేపి పబ్బం గడుపు కోవాలని వైసీపీ నేతలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. శుక్రవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు నిర్వహించిన సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ బద్రి అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన చిన్నపాటి గొడవను వైసీపీ నేతలు కులాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం సరి కాదన్నారు. ప్రజలు వైసీపీ దుర్మార్గాలను తట్టుకోలేక బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. బీసీలకు తొలినుంచి పట్టం కట్టింది టీడీపీయేనని వారు వివరించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు వాస్తవాలు మాట్లాడక పోతే ప్రజలు మరోసారి బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్రా పుల్లయ్య, వేముల తిరుమల కుమార్, బొమ్మలబోయిన నాగరాజు, సైదులు, ముస్యం శ్రీను, అంబటి మల్లి, రుద్రాల అచ్చారావు, పగడాల భాస్కరరావు, వలి, మైనార్టీ నాయకులు అహమద, వేముల కృష్ణ, బొమ్మిరెడ్డి నారాయణ, మాశెట్టి బుజ్జి, మంచి రామరాజు, కొప్పుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

పొలాలకు బాట వేయరూ...!

దాచేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు నిత్యం పంటపొలాలకు వెళ్ళే రహదారులు అధ్వానంగా ఉండటంతో వాటిని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పొలం బాటలు బురదమయంగా మారి నడిచేందుకు వీలు లేకుండాపోయింది. రహదారిపై ముళ్ళ కంపలు కూడా ఉండటంతో వర్షానికి తడిచిన వ్యవసాయకూలీలు కాళ్ళల్లో ముళ్ళు గుచ్చుకోవటంతో మరింత ప్రమాదకరంగా మారింది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సాగుభూమికి ఇది ప్రధాన బాట. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 23వ నెంబరు కాలువ బాటను బాగు చేయాలని రైతులు, వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.



దాచేపల్లిలో 23వ కాలువ కట్టపై అధ్వానంగా రహదారి

సంగం డెయిరీ బోనస్ పంపిణీ

మాచవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో శుక్రవారం సంగం డెయిరీల ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి బోనస్ పంపిణీ జరిగింది. మల్లవోలులో రూ.68,712, పిల్లుట్లలో రూ.78,647 బోనస్‌గా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ మేనేజర్ నవీన్, పీ సాంబయ్య, సీహెచ్ పిచ్చమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పిల్లుట్లలో సంగం డెయిరీ ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ తదితరులు

బాలుడి అప్పగింత

పిడుగురాళ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన 3వ తరగతి చదువుతున్న సాయి అనే బాలుడు వారం రోజుల క్రితం ఇంట్లో అలిగి హైదరాబాద్ వెళ్లేందుకు రైలు ఎక్కాడు. నరసరావుపేటలో రైలు దిగుతుండగా రైల్వే సిబ్బంది గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. తల్లిదండ్రులు వచ్చేంత వరకు సాయిని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న అనాధ వృద్ధుల ఆశ్రమంలో వుంచారు. సాయి ఇచ్చిన సమాచారం మేరకు తిరుపతిలో వుంటున్న తల్లి అంజనేయమ్మకు రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం సాయిని తల్లికి అప్పగించారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటీసులు జారీ

కారంపూడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్లలో వేంచేసియున్న శ్రీసింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి నియామకానికి ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినట్లు ఏఈవో శివనాగిరెడ్డి తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీజేపీ, ఎన్నికల కమిషన్ ఓట్ల దొంగలుగా మారారు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఎన్నికల కమిషన్ ఓట్ల దొంగలుగా మారారని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత 50 యేళ్లగా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక నిబంధనలను బీజేపీకి అనుకూలంగా మార్చుకుందన్నారు. సమావేశంలో గాదె పుల్లారెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, పినపాటి రమేష్, ఆదాం, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరం ఈ - పంటలో నమోదు చేసుకోవాలి

● ఏవో నరసింహారావు

కారంపూడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరం ఈ - పంటలో నమోదు చేసుకోవాలని ఏవో నరసింహారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కారంపూడి, చినకొదమగుండ్ల, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాల్లో ఈ - క్రాప్ బుకింగ్‌ను ఆయన పర్యవేక్షించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. శనివారం, ఆదివారం కూడా ఈ - పంట నమోదు చేస్తారన్నారు.

పెండింగ్ డీఏలు ఇవ్వాలి

రెంటచింతల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల టీచర్లతో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు ఆడిట్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని ఐఆర్ ప్రకటించాలని, ఎఫ్ఏ 1 అసెస్‌మెంట్ బుక్స్‌లోని ఏఎంఆర్‌ను స్కాన్ చేసే బాధ్యతల నుంచి టీచర్లను తప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.చిన నాసరయ్య, పి.సుదర్శన్, మహిళా కార్యదర్శి జోస్పినా, వీర వసంతకుమారి, సాగర్‌బాబు, లింగారెడ్డి, రామాచారి, సురేష్, ప్రతాప్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉపాధ్యాయ అవార్డులకు టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో 2 శివనాగేశ్వరరావు చెప్పారు. ఈ నెల 14వ తేదీ లోపు డిప్యూటీ ఈవో ద్వారా డీఈవోకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆన్‌లైన్‌లో చూడాలన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం కృషి

మాచర్లటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు అన్నారు. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రివర్గం ఆమోదించడంపై శుక్రవారం మాచర్లలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దుర్భాకుల ప్రసాదరావు, మాచర్ల హనుమంతురావు, కొర్రపాటి సుబ్బారావు, నందికొండ నారాయణ, మాచర్ల రాముడు, పూరపాటి శ్రీనివాసరావు, గుంటుపల్లి నరసింహారావు, సాయి, చరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

నచ్చిన లైటింగ్‌కు లైక్ కొట్టండి!

● సీఆర్‌డీఏ ప్రాజెక్టు భవనం లైటింగ్ డిజైన్‌పై ఓటింగ్

● వెబ్‌సైట్‌లో రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలు

మంగళగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ భవన నిర్మాణాల తాలూకు ఆకృతులు ప్రజాభీష్టానికి అనుగుణంగా ఉండాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. భవనాల బాహ్య ఆకృతులు ప్రజలు నచ్చే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించుకున్నారు. పూర్తయిన భవనాలకు తుది మెరుగులు దిద్దేక్రమంలో వాటి తాలూకు ఆకృతులకు పలు రకాలుగా డిజైన్‌లను రూపొందించి.. వాటిల్లో ఏది ఎక్కువమంది ఆమోదం పొందిందో తెలుసుకోవడానికి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. నవ్య రాజధాని అమరావతిలో పూర్తవుతున్న తొట్టతొలి భవనంగా ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం. గతంలో ఈ భవ



వీడియో-1 కు సంబంధించిన ఫొటో..

నం ప్రవేశ ద్వారానికి నాలుగు రకాలైన డిజైన్లను ఓటింగ్ నిమిత్తం ప్రజల ముందుంచారు. వాటిల్లో ఎక్కువమంది ఆమోదాన్ని పొందిన ఓ ఆకృతిని ఫైనల్ చేసి అదే డిజైన్‌ను భవనంపై ఏర్పాటు చేశారు. ఇపుడు తాజాగా సదరు అక్క




వీడియో-2 కు సంబంధించిన ఫొటో..

తికి తోడు భవనం ముందువైపు ఏ తరహా లైటింగ్‌ను ఏర్పాటుచేయాలనే దానిపై కూడ సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రెండు రకాల డిజైన్‌లను రెండు సంస్థల చేత రూపొందింపజేశారు. ఒక డిజైన్‌ను సిగ్నిపై అనే సంస్థ రూపొందించగా.. రెండవ డిజైన్‌ను జాక్వర్ సంస్థ తయారుచేసింది. ఈ రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలను సీఆర్‌డీఏ ఓటింగ్ నిమిత్తం శుక్రవారం తన వెబ్ సైట్‌లో అందుబాటులోఉంచింది. రెండింటిలో ప్రజామోదం పొందిన ఆ లైటింగ్ డిజైన్‌ను ఏర్పాటు చేస్తారు.

మయూరం..భ్రమరాంబ

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస 3వ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారికి నెమలి పింఛములతో ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 15న సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందని, ముత్తైదువులుపాల్గొని, అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.



మహాలక్ష్మి అమ్మవారికి బంగారు కిరీటం


బంగారు కిరీటంతో దాతలు ప్రకాశ్, నీలిమ దేవి

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్నా. శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరావు, స్వర్ణ కుమారి దంపతులు, కుటుంబ సభ్యులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టి సమర్పించారు. విజయవాడకు చెందిన దాతలు ప్రకాష్, నీలిమ దేవి, కుటుంబ సభ్యులు అమ్మ వారికి బంగారు కిరీటం, శ్రావణ పట్టి సమర్పించారు.

కలవరపెడుతున్న సుంకం

● సందిగ్ధంలో పడిన సాగు రైతులు

● అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం

● ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన

● చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు


బాపట్ల తీరంలో సాగు చేస్తున్న ఆక్వా చెరువులు

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగు సంక్షోభం వైపు పయనిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో ఆ ఆక్వా రైతు కుదేలు అవుతున్నాడు. వ్యాపారులు కలవరపాటుకు గురవుతున్నారు. ఇప్పటికే సాగు పెట్టుబడులు పెరిగిపోయి.. దిగుబడులు తగ్గి విలవిల్లాడుతున్న రైతును ట్రంపు సుంకం.. మరింత బాధ పెడుతోంది. ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా ఉన్నప్పటికీ.. అమెరికా దిగుమతి సుంకం పెంచడంతో వ్యాపారులు సందిగ్ధంలో పడ్డారు. బాపట్ల జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రొయ్యల విలువ రూ.888 కోట్లుగా ఉంది. ఇందులో అమెరికాదే అగ్రభాగం కావడం విశేషం. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. 70 శాతం వెనామి రొయ్యలు, 30 శాతం టైగర్ రొయ్యలు సాగు చేస్తున్నారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌లు ఐదు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 10వేల మందికి ఉపాధి లభిస్తోంది. వ్యవసాయం తర్వాత ఆక్వాదే అగ్ర భాగం. అమెరికా టారిఫ్ ఫలితంగా స్వదేశీ మార్కెట్‌లో రొయ్యల ధరల తగ్గుముఖం పట్టాయి.

వినియోగదారులపై ప్రభావం



ఆక్వా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు పెంచిన సుంకాల వల్ల వినియోగదారులపై భారం పడుతుంది. ఇప్పటికే 25 శాతం సుంకం అమలలోకి రాగా ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలలోకి రానుంది. రాబోవు రోజుల్లో మరిన్ని అంక్షలు పెట్టే అవకాశం ఉంది. సుంకాల పెంపుదలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పన్ను పెంచితే అమెరికాలో ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం అక్కడి వినియోగదారులపై పడుతుంది. కొన్ని దేశాలకు ఒకరంగా మరికొన్ని దేశాలకు మరొక రకంగా పన్ను విధించడం సరికాదు. పన్ను వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బయ్యర్లు ఎగుమతులు ఆపేయాలని చెప్పారు. కంటైనర్లు ఆగిపోయాయి. మిత్ర దేశం అంటూనే ఈవిధంగా చేయడం సరికాదు. ప్రధాని నరేంద్ర మోదీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు, వ్యాపారులు ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే విషయంపై దృష్టి పెట్టాలి.

- వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్యే, రాయల్ మెరైన్ ఇంఫెక్స్, సీఎండీ

చర్చలతో పన్ను తగ్గించే విధంగా చూడాలి



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెంచిన పన్ను వల్ల ఆక్వా రైతులు కుదేలవుతారు. ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రంగం ముందుకు సాగదు. ప్రభుత్వం చర్చించి పన్ను మొత్తం 20 శాతానికి తగ్గించే విధంగా చూడాలి. రాష్ట్రం నుం చి ఆక్వా ఉత్పత్తులు 60 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. పన్ను పెంచడం వల్ల హేచరీలు, ఫీడ్ మిల్లులు, రైతులు, హేచరీలు, మందుల దుకాణాలు మొత్తం దెబ్బ తినే ప్రమాదం ఉంది. గతంలో 8శాతం పన్ను మాత్రమే చెల్లించేవారని ఇప్పుడు 50 శాతానికి పెంచడం దారుణం. దేశంలో ఆక్వా ఉత్పత్తులు అధికంగా ఎగుమతి చేసే వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. విదేశీ మారక ద్రవ్యం దీని ద్వారా అధికంగా వస్తుంది. కావున దీనిని కాపాడుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు జరపాలి.

- అనంత నగేష్‌బాబు, సెక్రటరీ జనరల్, జాతీయ మత్స్యకార సంఘం

కల్ప వృక్షానికి కష్టకాలం


క్రోసూరు ప్రాంతంలో తగల బెట్టిన తాడి చెట్లు


పొలాలకు అడ్డంగా ఉన్నాయని నరికి వేసిన తాడి చెట్లు

క్రోసూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రాంతంలో తాటి తోపులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పొలాలకు, పంటలకు సాగుకు అడ్డ మొస్తున్నాయన్న ఉద్దేశంతో రైతులు వాటిని తగల బెట్టడం, నరికి వేయడం చేస్తున్నారు. మండలంలోని అందుకూరు, అనంతవరం, నాగవరం, హసానాబాద్, 88 తాళ్ళూరు, పీసపాడు, విప్పర్ల, బాలెమర్రు, పారుపల్లి తదితర గ్రామాల పరిధిలో ఆయా ఊళ్లకు వెళ్లే.. మార్గంలో వందలాది తాటిచెట్లు దర్శనమిచ్చేవి. కొన్ని దశాబ్దాల క్రితం గృహాల నిర్మాణానికి, శుభ కార్యాలప్పుడు పందిళ్లు వేసుకోవడానికి తాటి చెట్ల అవసరం ఎంతో ఉండేది. ఇటీవల కాలంలో పల్లె ప్రాంతాలు కూడా కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న నేపథ్యంలో తాటి చెట్ల అవసరం లేకపోవడంతో రైతులు వాటిని రూపు మాపే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చే గీత కార్మికులకే కాక స్థానికంగా ఉండే కార్మికులకు కూడా కల్లు గీత వల్ల ఉపాధి లభించేది. ఇటీవల కాలంలో వందలాది తాటి చెట్లను నరికేయడంతో.. భవిష్యత్తులో.. కల్ప వృక్షంగా భావించే తాడి చెట్లు కనుమరుగయ్యే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్లు

● దిగుబడులపై ప్రభావం ● నష్టాల బాటలో సాగుదారులు


లంక గ్రామాల్లో సాగవుతున్న బొప్పాయి తోట

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్ల పట్టి పీడిస్తున్నాయి. తెగుళ్ల కారణంగా ఆ ప్రభావం దిగుబడులపై చూపడంతో గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో బొప్పాయి తోటలు సాగు చేస్తున్న రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో రైతులు ఏటా బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు మండలాల్లో సుమారు 50 హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో రైతులు బొప్పాయి తోటలు సాగు చేస్తున్నారు. ఎకరాకు 1,600 మొక్కలు నాటుతారు. ఒకొక మొక్క రూ.18లకు కొనుగోలు చేసి కూలీలతో విత్తుకుంటారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కలకు సుమారు రూ.28,800 ఖర్చు అవుతుంది. దీనికి తోడు కౌలు రూ.50 వేలు, కూలీలు, ఇతర సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టి.. బొప్పాయి తోట సాగు చేపట్టారు. తోటలను రింగ్ స్పాట్ తెగుళ్లు ఆశించడంతో తోటల్లోని ఆకులు రంగులు మారిపోవడం, మొక్కకు వచ్చి కాయలు ఎదుగుదల లేకపోవడంతో పాటు పక్వానికి కూడా రావడం లేదు. గుర్తించిన రైతులు ఉద్యాన శాఖాధికారులకు తోటల గురించి వివరించగా వారు పరిశీలించి తెగుళ్లు ఆశించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, గాలిపాటున అప్పుడప్పుడు తెగుళ్ల బొప్పాయిని ఆశించడం జరుగుతుందని అధికారులు వివరించినట్లు రైతులు చెబుతున్నారు. తోటలను తెగుళ్లు ఆశించకుండా ఉంటే ఎకరాకు 20-25 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 10 టన్నుల దిగుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోవాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాల గర్భంలోకి.. శంకర్ విలాస్ ఆర్‌వోబీ


శంకర్‌విలాస్ ఆర్‌వోబీ, నిర్మాణ పనులు

● నేటి నుంచి కూల్చివేత ప్రారంభం

● ఆరు దశాబ్దాలకు పైగా నగరవాసులకు సేవలు



ప్రస్తుత బ్రిడ్జి సాంకేతిక వివరాలు



గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంచుమించు 65 ఏళ్లకు పైగా నగర వాసులు గుంటూరు ఒన్ టౌన్ నుంచి టూ టౌన్‌కు సులభతరంగా ప్రయాణించేలా ఈ వారధి సేవలందించింది. అమరావతి, తాడికొండ, తుళ్లూరు తదితర ప్రాంతాలను గుంటూరు నగరంతో అనుసంధానం చేసింది. గుంటూరు రైల్వే యార్డు మధ్యన నిలబడి తన భుజాలను ఇరువైపులా చాచి వాహనాలను చేరవేసింది. ఆరు దశాబ్దాలకు పైగా నిలిచిన శంకర్ విలాస్ ఆర్‌వోబీ నేటి నుంచి కాలగర్భంలో కలిసిపోనుంది. ఈ బ్రిడ్జి స్థానంలో కొత్త హంగులతో నాలుగు వరసల రైల్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇప్పటికే ప్రారంభమైన విషయం తెలిసిందే.

ఆర్వోబీ చరిత్ర ఇదీ..

1958కి ముందు గుంటూరు రైల్వేస్టేషన్ చాలా చిన్నదిగా ఉండేది. అప్పట్లో రైల్వే యార్డు కూడా తక్కువ విస్తీర్ణంలోనే ఉంది. గుంటూరు - అమరావతి రోడ్డులో 500 మీటర్ల దూరంలో లెవల్ క్రాసింగ్ గేటు నంబరు 497ఏ ఉండేది. రైళ్లు, గూడ్స్‌ల షంటింగ్ కారణంగా తరచుగా గేటు మూసేయాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. దాంతో అప్పట్లో జాతీయ రహదారుల శాఖ ఆర్‌వోబీని ప్రతిపాదించింది. ఇందుకు రైల్వే శాఖ కూడా ఆమోదం తెలపడంతో 1958 ఆగస్టు 4న అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి నాటి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ ఎస్‌వీఎల్ నరసింహారావు, చీఫ్ ఇంజనీర్ (హైవేస్) ఆంధ్రప్రదేశ్ ఎన్.దురాని కూడా హాజరయ్యారు. అప్పటి ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.8.37 లక్షల అంచనా విలువతో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. బ్రిడ్జికి ఉత్తరం వైపున అప్రోచ్ రోడ్డు పొడవు 793 అడుగులు, పిల్లర్ల నుంచి 446 అడుగులు, దక్షిణ వైపున అప్రోచ్ పొడవు 583 అడుగులు, పిల్లర్ల నుంచి 334.5 అడుగుల మేరకు బ్రిడ్జిని నిర్మించారు. రైళ్ల రాకపోకలకు వీలుగా బ్రిడ్జి కింద నాలుగు కానాలు నిర్మించారు. బ్రిడ్జి పైన రోడ్డు మార్గం 24 అడుగులు, కాలి బాటలు ఇరువైపులా 6 అడుగుల చొప్పున నిర్మించారు.

పెరిగిన వాహనాల రద్దీ

కాగా 2001కి ముందు వరకు నగరంలో పెద్దగా వాహనాల సంచారం ఉండేది కాదు. దాంతో బ్రిడ్జిపై ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఎప్పుడైతే కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య పెరిగిందో అప్పటి నుంచి ఈ ఆర్‌వోబీపై ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ వచ్చింది. దాంతో ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి మధ్యలో తాత్కాలిక ప్లాస్టిక్ డివైడర్ స్తంభాలు ఏర్పాటు చేసి కొంత మేరకు వాహనాలు ఒక దాని వెంట ఒకటి వెళ్లేలా చేశారు. ఆర్ అండ్ బీ డిపార్టుమెంట్ అడపాదడపాగా మరమ్మతులు నిర్వహించేది. కాలిబాట్లపై పలుమార్లు టైల్స్ నిర్మించింది. బ్రిడ్జి పైన హాట్ మిక్స్‌తో రోడ్డు వేయడం వల్ల ఫుట్‌పాత్‌ల ఎత్తు తగ్గిపోయాయి. దాంతో వాటిపై కూడా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మించాలన్న ఆలోచన 2004లోనే జరిగింది. అయితే ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితం అయ్యాయి తప్పా కార్య రూపం దాల్చలేదు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ స్కీమ్ కింద ఈ ఆర్‌వోబీ నిర్మాణాన్ని శాంక్షన్ చేసింది. అయితే పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేయించి పాత బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మింప చేస్తున్నారు. కాగా శుక్రవారం చాలామంది పాత బ్రిడ్జి వద్దకు చేరుకొని తీపి జ్ఞాపకాలుగా డిజిటల్‌లో భద్రం చేసుకొనేందుకు ఫోటోలు దిగారు.

కొత్త బ్రిడ్జి సాంకేతిక అంశాలు

సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌లు కలుపుకొని మొత్తం 21.550 మీటర్ల వెడల్పుతో ఈ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మొత్తం 930 మీటర్ల పొడవునా.. ఈ వంతెనలో జీజీహెచ్ వైపు 168 మీటర్ల ఆర్ఈ(రీయిన్‌ఫోర్స్‌డ్ ఎర్త్) వాల్ 168 మీటర్లు, వయాడక్ట్ స్పాన్‌లు 11 నంబర్లు కలిపి 253 మీటర్లు, రైల్వే భాగం 64 మీటర్లు, అరండల్‌పేట వైపున వయాడక్ట్ స్పాన్‌లు 10 నంబర్లు కలిపి 230 మీటర్లు, ఆర్ఈ వాల్ 215 మీటర్ల పొడవునా నిర్మిస్తారు. 23 అడుగుల వెడల్పుతో రెండు వైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తారు. బ్రాడీపేట నాల్గో లైను, అరండల్‌పేట ఐదో లైను, జీజీహెచ్ వద్ద అండర్‌పాస్‌లు సదుపాయాలుంటాయి. ఉమెన్స్ కాలేజ్ జంక్షన్ నుంచి ఏసీ కళాశాల వైపునకు 100 మీటర్ల దూరంలో బ్రిడ్జి ప్రారంభమవుతుంది. అరండల్‌పేట వైపు నుంచి సులభతరంగా ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోకి వెళ్లిపోవచ్చు. ప్రస్తుత ఆర్‌వోబీ రైల్వేట్రాక్ కంటే 5.9 మీటర్ల ఎత్తులో ఉంది. దీనిని మారిన రైల్వే నిబంధనల ప్రకారం 9 మీటర్ల ఎత్తుకు నూతన బ్రిడ్జిని పెంచ బోతున్నారు. అరండల్‌పేట వైపున 8 - 9 లైన్ల మధ్యన ఈ బ్రిడ్జి ప్రారంభమవుతుంది. 2028 లోపే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభింప చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకొని ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం పూర్తి అయింది.

నకిలీ యజమానిని ఫొటో పట్టిచ్చేస్తుంది..

● రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్

● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు చెక్ పడనుంది. ఎవరినో తీసుకువచ్చి ఇతనిదే భూమి అని చెప్పి దొంగ రిజిస్ట్రేషన్ చేయించడం ఇకపై కుదరదు. గతంలో ఒకే పేరు ఉన్న వ్యక్తులను తీసుకు వచ్చి ఆధార్ మార్పులు(నకిలీ) చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్‌లు సైతం జరిగాయి. వీటన్నిటికీ ఇకపై చెక్ పడనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో పలు మార్పులు ప్రభుత్వం చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. దీంతో భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చినా తెలిసేది కాదు. మార్పుల నేపథ్యం సంబంధిత వ్యక్తి ఆధార్ నంబర్ చెప్పగానే అందులో ఉన్న ఫొటో ప్రిపరేషన్ డేటాలో వస్తుంది. మూడురోజుల నుంచి ఈ విధానం అమలవుతోంది.

కొనుగోలు దారుని చేతికే డాక్యుమెంటు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంటును కొనుగోలు దారునికే ఇవ్వనున్నారు. ఈ విషయంలో గతంలో క్రయ, విక్రయ దారులు ఇబ్బందులు పడేవారు. కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంటు రైటర్లు ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డాక్యుంటును సంబంధిత వ్యక్తికి అందజేస్తారు.

ఓటీపీ ఇక్కట్లు

నూతన విధానంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. వన్ టైమ్ పాస్ వర్డ్ వల్ల కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మొబైల్ ఫోన్‌ను ఆధార్‌కు లింకు చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చి కూడా డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి తలెత్తుతుందని డాక్యుమెంటు రైటర్లు చెబుతున్నారు. చదువురాని వారు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా వచ్చే మెసేజ్‌లు అర్థం కాక.. ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఆధార్ నంబరు నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే సరిపోతుందని అంటున్నారు.

ఫొటోల ద్వారా తెలిసి పోతుంది

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పుడు ఆధార్ ఓటీపి విదానంతో ఫొటో వస్తుంది. దీంతో సంబంధిత వ్యక్తి అసలా..నకిలా.. అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీని వల్ల మోసాలకు తావు ఉండదు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంటును కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. థంబ్ వేయడం ద్వారా సంబంధిత వ్యక్తి తీసుకోవాల్సి ఉంటుంది.

- అశోక్, సబ్ రిజిస్ట్రార్, సత్తెనపల్లి

ఆరోగ్యానికి భరోసా.. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు(ఆరోగ్యశ్రీ) సేవలు పల్నాడు జిల్లాలో రోగులకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు.. ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. పేదలే కాదు కార్డులు ఉన్న ఉన్నత స్థాయి వర్గాల వారు సేవలు పొందుతున్నారు. కార్డులేని అర్హులకు కూడా వైద్యసేవలకు సీఎంఓ అనుమతులు ఇప్పిస్తున్నారు.

కార్డు లేకుంటే ఎవరిని సంప్రదించాలి

ఆరోగ్యశ్రీ కార్డులేని అర్హులు అనారోగ్యానికి గురైై నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్ళి ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి. వారు జిల్లా సమన్వయ కర్త కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. అర్హతను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అధకారికంగా.. అదికారికంగా అనుమతులు తీసుకుని వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారు.

ఆరోగ్య మిత్రల వ్యవస్థ

ఆరోగ్య మిత్ర వ్యవస్థ ఉంది. పూర్తి ఉచితంగా సేవలు అందించి. డిశ్చార్జ్ తర్వాత రవాణా చార్జీలు అందజేస్తారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటే 104, 14400 టోల్‌ఫ్రీ నంబర్లకు ఆరోగ్యమిత్రలకు పిర్యాదు చేయవచ్చు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నాదెండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామానికి చెందిన నాశం ఆదినారాయణ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. ఇటీవల రైతు ఆదినారాయణ అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో కృష్ణాజిల్లా అసిస్టెంట్ సహకార రిజిస్టర్ ఎం.వెంకటేశ్వరరావు తన వంతుగా ఈ ఆర్థిక సాయాన్ని ఆదినారాయణ భార్య రమణకు అందజేశారు. కార్యక్రమంలో నాదెండ్ల సహకార సంఘ సీఈవో చేకూరి ధనలక్ష్మి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి), విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ అంశాన్ని గమనించి ప్రజలు సహకరించ వలసినదిగా కోరారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, బుచ్చిపాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు శుక్రవారం ఏఈ రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం తెల్లవారు జామున ఉదయం 9గంటల వరకు ఉంటుందన్నారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

● శావల్యాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ మరమ్మతుల్లో భాగంగా రెండో శనివారం శావల్యాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ నటరాజ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

11న పోపూరి వర్ధంతి సభ

యడ్లపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతు నాయకుడు పోపూరి రామారావు ఆరో వర్ధంతి సభ ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం మండల కార్యదర్శి జరుగుల శంకరరావు, లింగారావుపాలెం శాఖా కార్యదర్శి ఆలోకం సుబ్బారావు, యడ్లపాడు శాఖా కార్యదర్శి బి.పీటర్‌లు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10గంటలకు జరిగే ఈ వర్ధంతి సభకు రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, ప్రముఖ న్యాయవాది చెరుకూరి సత్యన్నారాయణలు హాజరై స్మారకోపన్యాసం చేయనున్నట్లు తెలిపారు. ప్రత్తి, మిరప పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, గిట్టుబాటు ధర, సాగునీటి సమస్యలపై నాటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి రామారావన్నారు. ఆయన అందించిన సేవలకు గుర్తుగా యడ్లపాడులో పీఆర్ విజ్ఞాన కేంద్రం స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ వర్ధంతి రామారావు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు: చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు నియోజకవర్గంలోని అక్క, చెల్లెమ్మలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగింటి ఆడపడుచులకు, అనునిత్యం ఆశీస్సులు కురిపించే అక్కాచెల్లెళ్లకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ అన్నారు. కుటుంబ బాంధవ్యాలకు అధిక ప్రాధాన్యమిచ్చే మన భారతీయులకు శ్రావణ పౌర్ణమి నాడు వచ్చే రాఖీ పండుగ ఒక ఆనందాల వేడుకని తెలిపారు. రక్షాబంధన్ స్ఫూర్తిగా సమాజంలోని ప్రతి ఆడపడుచుకు రక్షణగా నిలుద్దామని, ఆడపడుచుల గౌరవాన్ని కాపాడేందుకు మనమందరం సంకల్పిద్దామని తెలిపారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

నరసరావుపేట టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనుబంధితంగా పనిచేస్తున్న వాగ్దేవి డిగ్రీ కళాశాలకు యూజీసీ అనుమతితో స్వయం పాలిత స్థితి (అటానమస్) మంజూరు అయిందని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మీడియా సమావేశం జరిగింది. ఈసందర్భంగా కపలవాయి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ, ప్రతి సంవత్సరం 90శాతం పైగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అటామస్ హోదా పొందటం కళాశాల అభివృద్ధికి ఒక గొప్ప మైలురాయి అన్నారు. అటానమస్ హోదాలో మేము పాఠ్యాంశాలలో స్వతంత్ర్యంగా మార్పులు చేసుకోవచ్చన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన పది సంవత్సరాలలో జాతీయ స్థాయిలో న్యాక్ గ్రేడ్, 12సంవత్సరాలలో అటానమస్ హోదా సాధించి పల్నాడు జిల్లాలోనే ఏకైక కాలేజీ వాగ్దేవి డిగ్రీ కాలేజీ అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కిష్టకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు





వరలక్ష్మీ అలంకరణలో అమ్మవారు, ప్రత్యేక పూజల్లోపాల్గొన్న భక్తులు

వినుకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సదావర్తి సంఘం కమిటీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ బాబ్జీ, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 310మంది మహిళా భక్తులు వైభవపేతంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. గర్భగుడిలోని అమ్మవారికి వరలక్ష్మీ అలంకారం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు కార్యక్రమంలో తాతా సత్యనారాయణ, పెరుమాళ్ల అమర్నాథ్‌రెడ్డి, నగేష్, పెండేల సురేష్, కొల్లిపర నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అరన్చకులు పొట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడు రోడ్డు ప్రశాంతి నగర్‌లో ఉన్న చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం, అమ్మవారి పూజలు నిర్వహించారు. గణపతిపూజ, సువర్చల అమ్మవారికి అభిషేకాలు, లక్ష్మీవ్రతం, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండంలోని గ్రామాల్లో మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రొంపిచర్లలోని వాసవి, శంకరస్వామి, చౌడేశ్వరిదేవి, అంకమ్మతల్లి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, మాచవరం, పరగతిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి, సంతగుడిపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకాలు జరిగాయి. కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శావల్యాపురం సెంటర్లోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో పూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లక్ష్మీదేవి అవతారంలో ముస్తాబు చేసి కరెన్సీ నోట్లుతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. పోట్లూరు శివారు అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న లక్ష్మీతిరుపతమ్మ దేవాలయంలో పూజారులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వాణిల ఆధ్వర్యంలో లక్ష్మీతిరుపతమ్మ, మావురాల ఎల్లమ్మ, అంకమ్మలకు కూరగాయలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కారుమంచిలో మహిళలు జలబిందెలతో నాభిశిలకు క్షీరాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయాల్లో భజనలు చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాతులూరులో రెడ్డిపేరంటాలమ్మ దేవాలయం వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలుచేసి వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. ప్రధాన పూజారి పూర్ణాచారి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. హాజరైన భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో మహిళలు ఇళ్ళ వద్దనే వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

బొల్లాపల్లి...

బొల్లాపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్లలోని గంగా గౌరి శంకరస్వామి దేవస్థానంలో శుక్రవారం పార్వతి అమ్మవారికి పంచామృతంతో విశిష్ఠ అభిషేకాలు నిర్వహించి అనంతరం మహిళల సౌభాగ్యం కోసం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించటం జరిగింది. అనంతరం కుంకుమ పూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నూజెండ్ల...

నూజెండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. దేవాలయాల్లో జరిగిన సామూహిక వ్రతాల్లో విశేషంగా పాల్గొని దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అదే విధంగా గృహాల్లో ప్రత్యేకంగా బంధు మిత్రులతో వరలక్ష్మీ వ్రతాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు.



సాతులూరులో వ్రతంలో పాల్గొన్న మహిళలు





ప్రత్యేక అలంకరణలో కామాక్షి అమ్మవారు, గోగులపాడు చంద్రమౌళేశ్వర ఆలయంలోని అమ్మవారు



గంటావారిపాలెంలో కూరగాయల అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ



ప్రశాంతి నగర్‌లో వరలక్ష్మీ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నరసరావుపేట పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలో సుపరిపాలనకు శ్రీకారం చుట్టే లక్ష్యంతో బాలయ్య నగర్, వెంగమాంబనగర్, హరికృష్ణ నగర్‌లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుపరిపాలన అనేది కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు, అది మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల వివరాలను ఆయా వార్డు ప్రజలకు తెలియజేశారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ అరవింద బాబు అధికారులను ఆదేశించారు.



నరసరావుపేటలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

జీఐఎస్ సర్వేపై మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ సమీక్ష

● ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి

చిలకలూరిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని సచివాలయ సిబ్బందితో జీఐఎస్ సర్వేకు సంబంధించి మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీఐఎస్ సర్వే, దాని లక్ష్యాలను గురించి సచివాలయ సిబ్బందికి ఆయన వివరించారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికి ప్రభుత్వ సేవలను చేరువచేయడం, పారదర్శకతను పెంపొందించడం, పరిపాలనను మెరుగుపరచడం కోసం ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో సరైన పన్ను విధించడానికి డోర్ టూ డోర్ జీఐఎస్ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ప్రజలు జీఐఎస్ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ వాసులకు మెరుగైన సేవలు అందించేందుకు, సరైన పన్ను విధించడానికి, శాటిలైట్ మ్యాపింగ్‌కు అనుగుణంగా, యుటిలిటీ మ్యాపింగ్ కోసం ఇంటింటికి జీఐఎస్ సర్వే కోసమని వస్తున్న సచివాలయ సిబ్బందికి పట్టణ ప్రజలు పూర్తి వివరాలను అందించి సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్ఐ గిరిబాబు, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.



సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వినుకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు 3వ రోజు అగ్ని ధ్యానం, నిత్య హోమం, కుంభ పూజ, స్వామివారికి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.శ్రవణకుమార్, బొల్లాపల్లి మండలం పేరూరుపాడుకు చెందిన ఈ.సాయి ఆధ్వర్యంలో భజంత్రీలు, మేళతాళాలతో వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణసుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, గుడి మేనేజర్ వాసు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను ఆక్రమించుకున్నారు

● వైసీపీ జడ్పీటీసీపై ఆరేపల్లి గ్రామస్థుల ఆరోపణ

రొంపిచర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రొంపిచర్ల మండల జడ్పీటీసీ పిల్లి ఓబులరెడ్డి భూ దందాకు తెగబడ్డారని గారేపల్లి గ్రామస్తులు శుక్రవారం ఆరోపించారు. వివరాల్లోకి వెళితే సుమారు 50 సంవత్సరాల క్రితం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానానికి అగ్రహారికులు 39వ సర్వే నెంబరులో రెండు ఎకరాలు కేటాయించారని వారు పేర్కొన్నారు. ఐతే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవాదాయ భూమిని జడ్పీటీసీ పిల్లి ఓబులరెడ్డి వినుకొండ సమీపంలోని ఏనుగుపాలెం పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయించాడని తెలిపారు. సుమారు మూడు సంవత్సరాల క్రితం ఈ సంఘటన జరిగింది. ఐతే దేవదాయ భూమికి సంబంధించి ఎవ్వరూ తమపేరుతో ఎక్కించుకోరని నమ్మకంతో ఉన్నామని గ్రామస్థులు తెలిపారు. ఐతే పిల్లి ఓబులరెడ్డి కొద్ది రోజుల క్రితం భూమిని అమ్మటానికి ప్రయత్నించగా విషయం తెలిసిందని పేర్కొన్నారు. దీంతో సమాచారాన్ని రిజిస్టర్ కార్యాలయంలో తెలిపామన్నారు. అనంతరం తహసీల్దార్‌ను కలవటానికి రొంపిచర్ల రాగా ఈ లోపే ఓబులరెడ్డి వేరే వ్యక్తికి దేవదాయ భూమిని రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దేవుడు భూములకు రక్షణ లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయంపై తహసీల్దార్ బండి నిర్మలను వివరణ కోరగా గతంలోనే జిల్లెలమూడి ప్రసాదు పేరుతో ధృవీకరణ పత్రాలు ఉన్నాయన్నారు. గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే తగు విచారణ జరుపుతామని పేర్కొన్నారు.



నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధ మహిళ ఫిర్యాదు పరిష్కారానికి స్వయంగా ఆమె ఇంటికి వెళ్ళి విచారిస్తున్న ఎస్ఐ కిషోర్

బలహీనవర్గాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన మహిళలు వృద్ధులు, బలహీనవర్గాల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వృద్ధులకు సంబంధించిన సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులు స్వయంగా వృద్ధుల గృహాలకు వెళ్లి ఎవరి నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో విచారించి చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా కృషి చేస్తామని పోలీసు అధికారులు వృద్ధులకు భరోసా ఇచ్చారు.

బ్యాంకుల భద్రతపై ఎస్పీ సమీక్ష

నరసరావుపేట లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల భద్రతా ప్రమాణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లోను బ్యాంక్ మేనేజర్లు, సెక్యూరిటీ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీటీవీ కెమెరాల వినియోగం, సెక్యూరిటీ గార్డ్స్ పనితీరు, అలారం సిస్టమ్స్ డబుల్‌లాక్ విధానం వంటి సాంకేతిక భద్రత చర్యలు, అత్యవసర పరిస్థితులలో తీసుకోవలసిన చర్యలపై వివరంగా చర్చించి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ సంతోష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాంప్రసాద్, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు, సెక్యూరిటీ అధికారులు, ఎస్‌బీ-2 సీఐ శరత్‌బాబు, జిల్లా సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యాపారి మృతి



గోలి రమేష్ (ఫైల్)

వినుకొండ టౌన్ ఆగస్టు 8: (ఆంధ్రజ్యోతి) వినుకొండ పట్టణంలోని ఓ టీస్టాల్ వ్యాపారి అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన సంఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బిడ్జి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన గోలి రమేష్ ఉదయం వినుకొండలోని టీస్టాల్ తెరిచేందుకు వినుకొండకు వచ్చాడు. సాయంత్రం పసుపులేరు బిడ్జి సమీపంలో శవమై కనిపించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు వినుకొండ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

వినుకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా 100ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సీపీఐ జిల్లా మహాసభలు వినుకొండలో నిర్వహించుకోవడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మహాసభల సందర్భంగా వినుకొండకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 28వ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఒంగోలు రాష్ట్ర మహాసభలకు పల్నాడు జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, మారుతివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నూర్జహాన్‌కు చెక్కును అందజేస్తున్న ఏఎస్పీ సంతోష్


హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మరణించిన హోంగార్డు కుటుంబానికి సహచర హోంగార్డులు అండగా నిలిచారు. నకరికల్లు పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా సేవలందిస్తూ ఏడాది మార్చి 28న షేక్ మహమ్మద్ షరీఫ్ గుండెపోటుతో మరణించాడు. ఆయన కుటుంబానికి జిల్లాలోని ఆయన బ్యాచ్ హోంగార్డులు వారి ఒకరోజు వేతనాన్ని రూ.5లక్షల చెక్కు అందించారు. ఈ చెక్కును శుక్రవారం పల్నాడు జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్ షరీఫ్ భార్య నూర్జహాన్ బేగంకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ హోంగార్డులను అభినందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసి దినోత్సవ పోసర్ల ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసులు శనివారం ఆదివాసి దినోత్సవం జరుపుకుంటున్నారని, ప్రభుత్వాలు కూడా దీన్ని ఒక వేడుకగా నిర్వహించడం జరుగుతుందని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి 16 వరకు ఆదివాసి హక్కుల, ఆదివాసి చట్టాలు, ఆదివాసి జీవితాలను పరిరక్షించుకోవడం, ఆదివాసి ప్రాంతాలలో ఉద్యమ సంస్థలతో ప్రభుత్వాలు చర్చించి ఆదివాసి సమస్యలు పరిష్కరించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, థామస్ పాల్గొన్నారు.

సీనియర్ నేత్ర వైద్యుడు నల్లమోతు ప్రసాదరావు మృతి



డాక్టర్ నల్లమోతు ప్రసాదరావు

చిలకలూరిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న రాయుడు కంటి ఆసుపత్రి వైద్యుడు నల్లమోతు ప్రసాదరావు (70) శుక్రవారం కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు. ముగ్గురు డాక్టర్లుగా స్థిరపడ్డారు. గత 40సంవత్సరాలుగా రాయుడు కంటి ఆసుపత్రి ద్వారా నేత్ర వైద్య సేవలు అందిస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఆయన అస్వస్థులుగా ఉన్నారు. డాక్టర్ నల్లమోతు ప్రసాదరావు మృతికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, చిలకలూరిపేట ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ముద్దన రమేష్ బాబు, డాక్టర్ మక్కెన వంశీ కృష్ణ, ఐఎంఏ సభ్యులు సంతాపం ప్రకటించారు. ప్రసాదరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.